
క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్ర మైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసి న ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

సర్వే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

పెద్దకడబూరు: పంచాయతీ కార్యదర్శిలకు గ్రామ సచివాలయ సర్వేల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిలు లక్ష్మి, దస్తగిరి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభావతికి శనివారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా షెడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకఫండ్ ఇప్పించాలన్నారు. ప్రతి నాలుగు వేల జనాభా కలిగిన గ్రామ పంచాయతీకి శానిటేషన్ మేస్త్రీలను ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శిలు సాయి తేజ, మంజునాథ్, చిన్నయ్య, శారధ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను విజయవంతం చేద్దాం

ఆదోని రూరల్: జూలై 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, పట్టణాధ్యక్షులు భీమేష్, ఓ.బి.నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారు సమావేశమై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెల 30వ తేదీన ప్రభుత్వ కార్యాలయాలకు సమ్మె నోటీసులు ఇవ్వడం, జూలై 3వ తేదీన రౌండ్‌టేబుల్ సమావేశం, 7వ తేదీన బైకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 9వ తేదీన నిరసన ర్యాలీ మంగళ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. పెద్ద ఎత్తున ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, కృష్ణమూర్తి, వెంకప్ప, నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడి మృతి



గోవిందరాజులు (ఫైల్)

ఆదోని టౌన్: ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గోవిందరాజులు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతికి పార్టీ ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలియజేశారు.ఎమ్మార్పీఎస్‌నాయకుడిగా గోవిందరాజులు కొనసాగుతూ దళితుల హక్కుల సాధనకై అహర్నిశలు పోరా టాలు చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు.ఆయన ఆత్మశాంతించాలని ప్రార్థించారు.

శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే సేవా కార్యక్రమాలకు బీదర్‌కు చెందిన ఆసిస్‌దేస్ పాండే అనే భక్తుడు లక్ష రూపాయాలు విరాళంగా అందజేసినట్లు మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు తెలిపారు. వీరికి స్వామి వారి మెమెంటో, ఫలమంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం అందజేశారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

మంత్రాలయం: మండల కేంద్రంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆర్‌వీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాజ డిమాండ్ చేశారు. శనివారం జెడ్పీ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన విధంగానే మంత్రాలయంలో కూడా బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ, మోహన్,రాజేష్,శేషు తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ: కుటుంబ కలహాలు, పెళ్లి సంబంధం రద్దు కావడంతో మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన భాజాహుసేని అనే యువకుడు ఉదయం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ జయన్న తెలిపారు.

విద్యాలయాలా.. వ్యాపార కేంద్రాలా?

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో అడ్డగోలుగా ఫీజులు
- పుస్తకాలు, యూనిఫాం, బస్సు, ఇతర సామగ్రికి అదనం
- తల్లిదండ్రులకు భారంగా మారిన పిల్లల చదువులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



అధిక ఫీజులను నియంత్రించాలని ఆదోనిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆదోని అర్బన్: ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజులు తల్లిదండ్రులను భయపెడుతున్నాయి. నియోజకవర్గంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యతో వ్యాపారం చేస్తున్నాయి. చదువు మాత్రమే చెప్పాల్సిన యాజమాన్యాలు పుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాం, షూలు, సాక్సులు ఇలా అన్నింటితో వ్యాపారాలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాఠశాలల యాజమాన్యాలు అతిక్రమిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు, స్థానిక అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేగాకుండా ఆయా పాఠశాలలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కే లేదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎల్‌కేజీకి రూ.20 వేలు

ఆదోని నియోజకవర్గంలో 144 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆ పాఠశాలల్లో దాదాపు 26 వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యాబోధనకు పాఠశాలను బట్టి తరగతికి రూ.20 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. మొత్తం ఫీజులో 50 శాతం మొదటగానే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. మిగిలిన ఫీజును రెండు దఫాలుగా చెల్లించాలి. ఫీజు స్ట్రక్చర్‌ను నోటీసు బోర్డులో ఉంచాలనే నిబంధన ఉన్నా ఏ పాఠశాలలో అమలు కావడం లేదు. పేరెంట్స్ కమిటీలు ఎక్కడా ఉండవు, ఫీజులకు తగ్గ వసతులు ఏ పాఠశాలల్లో కనిపించవు. గాలి, వెలుతురు లేని గదుల్లో నిబంధనలకు విద్యార్థులను వేసి బోధన చేస్తున్న పరిస్థితి ఉంది.

క్రీడా మైదానాలు లేకపోయినా ప్రత్యేక ఫీజులు

ప్రతి పాఠశాలలో కచ్చితంగా క్రీడా మైదానాలు ఉండాల్సి ఉండగా, ఇందుకు కూడా ప్రత్యేకంగా ఫీజులు వసూలు చేయడం ఈ పాఠశాలలకే చెల్లుతోంది. హైటెక్ వసతులు కేవలం ప్రచారానికే, వాస్తవంలో కనీసం మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. అపార్ట్‌మెంట్, భవనాల్లో ఇలాంటి పాఠశాలలను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి ట్రాన్స్‌పోర్టు పేరుతో రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు వసూలు చేస్తున్నారు. విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు, పాఠశాలల వార్షికోత్సవ వేడుకల పేరుతో అదనంగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వానికి జీఎస్టీ కూడా రాని పరిస్థితి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలను మాత్రమే బోధించాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో ఎలాంటి పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీలు విక్రయించకూడదు. అయితే కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని విక్రయిస్తున్నారు. సొంతంగా పాఠశాలల యాజమాన్యం మెటీరియల్‌ను ముద్రించి ఒక్కో విద్యార్థి నుంచి పుస్తకాల పేరుతో రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు, ఒక్కో యూనిఫాం రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతో పాటు, స్టేషనరీకి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ప్రకారం ఇదే వ్యాపారం బయట షాపుల్లో జరిగితే 12 శాతం జీఎస్టీ రూపంలో సుమారు కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం చేరేది. పైగా వీటి ధరలు బయటి మార్కెట్ కంటే రెండింతలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

మామూళ్ల మత్తులో విద్యాశాఖ

విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల గుర్తింపు, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాం విక్రయాలపై ఎంఈఓ, డిప్యూటీ ఈఓ, డీఈఓ పాఠశాలలకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచినా అధికారులు ఎప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. విద్యాశాఖలో గుమస్తా నుంచి అధికారుల వరకు ముడుపులు ఇవ్వడంతో ఆ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఫీజులను నియంత్రించాలని పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చదువు కొనాల్సి వస్తోంది



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు అధికమయ్యాయి. అతి ఘోరంగా వసూలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు చదువును కొనాల్సి వస్తోంది. నాకు ఇద్దరు కుమార్తెలు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఫీజులు కట్టేందుకు, పుస్తాకాలు కొనేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఫీజుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. జీవో నంబర్ 1 నిబంధనలను అనుసరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– అశ్విన్‌కుమార్, విద్యార్థిని తండ్రి

ఫీజులు కట్టలేక పోతున్నాం



నా కుమారుడు ప్రవేటు పాఠశాలలో చదువుతున్నా డు. పాఠశాలలో అధిక ఫీజులు కట్టలేకపోతున్నాం. తల్లిదండ్రులకు ఊరట కలిగించేలా ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలులోకి తేవాలి. పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీని ఏర్పాటు చేస్తే ఫీజులను నియంత్రించే అవకాశం ఉంటుంది.
– నాగరాజు, విద్యార్థి తండ్రి

విద్యార్థుల తల్లిదండ్రుల్లో మార్పు రావాలి

పాఠశాలల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేలా మార్పు రావాలి. ఇప్పటివరకు ఎవరూ రాలేదు. జీవో నంబర్ 1ని ప్రతి పాఠశాలలో అనుసరించాలి. ఫీజుల పట్టిక నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించకూడదు. ఇప్పటివరకు బదిలీల ప్రక్రియ ఉండేది. అది ముగిసింది. ఇక నుంచి ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తాం.
– వెంకటరమణరెడ్డి, డిప్యూటీ ఈఓ

పట్టుపై సబ్సిడీ ఇవ్వాలి



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘ నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులకు ప్రభుత్వం పట్టుపై 50 శాతం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘ నాయకులు భరణి కాలప్ప, కామర్తి లక్ష్మన్న, కునె కృష్ణ, చేతి వృత్తిదారుల సంఘ జిల్లా నాయకులు గోవిందు కోరారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణ జనాభాలో 40 శాతం చేతివృత్తిదారులున్నారన్నారు. పద్మశ్రీ మాచాని సోమప్ప ప్రారంభించిన చేనేత కోఆపరేటివ్ సొసైటీకి పూర్వవైభవాన్ని తేవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో చేనేత రంగం కుదేలైందని తెలిపారు.నేతన్న నేస్తం కింద రూ.30వేలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకుడు రాముడు, నాయకులు చాయ శ్రీనివాసులు, వెంకటేష్, గడిగె శ్రీను పాల్గొన్నారు.

వన్య ప్రాణుల జోలికి వెళ్లకండి

కౌతాళం: వన్య ప్రాణాలు జోలికి వెళ్లకూడదని ఆదోని ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ తేజస్వీని కోరారు. తిప్పలదొడ్డి వద్ద శుక్రవారం చిరుత సంచరించడంతో అక్కడకి వెళ్లి మానిటరింగ్ చేసినట్లు తెలిపారు. చిరుత వచ్చిన దారినే వెళ్లే పోయేదని, కానీ ప్రజలు చుట్టుముట్టడంతో ఒక స్థానం నుంచి ఇంకో స్థానానికి వెళ్లడం మొదలుపెట్టిందన్నారు. దానిని హ్యాండిల్ చేయడానికి ఆత్మకూరు నుంచి ఎస్ఎస్‌టీఆర్ బృందం వచ్చి మానిటరింగ్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు పది గంటల ప్రాంతంలో చిరుత దాక్కున్న స్థానం నుంచి చూడి రిజర్వు ఫారెస్టు గుండా వెళ్లి పోయిందని చెప్పారు. చిరుత, ఏ ఇతర ప్రాణి కనిపించినా వెంటనే ఫారెస్టు ఆఫీసర్లకు తెలియజేయాలని కోరారు. వన్య ప్రాణులు కనిపిస్తే ప్రజలు గుమిగుడకుండా దూరంగా ఉండాలని కోరారు.

మంత్రికి మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టవా?



మాట్లాడుతున్న రైతుకూలీ సంఘ నాయకుడు జయన్న

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి గత 54 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు పట్టదా అని రైతు కూలీ సంఘ తాలూకా నాయకుడు జయన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్షలు చేపట్టిన మున్సిపల్ కార్మికులకు శనివారం రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పట్టణంలో ప్రజలందరికీ తాగేందుకు మంచినీరు అందించే కార్మికుల మాత్రం ప్రభుత్వం సమస్యలు పరిష్కరించక వారి కంట కన్నీరు తెప్పిస్తోందని అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, రాజేంద్ర, రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు, చేనేత కార్మిక సంఘ నాయకులు నీలకంఠ, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

లింక్ పెట్టి ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులకు లింక్ పెట్టి వేరే ఎరువులను విక్రయించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, మండల వ్యవసాయాధికారి శివశంకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక సాయిరాం సీడ్స్, ఫెస్టిసైడ్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఎరువు, పురుగు మందు, విత్తనానికి తప్పకుండా ఇన్‌వాయిస్ ఉండాలన్నారు. రైతుకు బిల్లు ఇచ్చి సంతకం చేయించుకోవాలని తెలిపారు. ఎరువు బస్తాలకు ఈ–పాస్ అప్డేట్ చేయాలని సూచించారు. ఓ ఫామ్‌లో ఇంక్లూడ్ కానందున రూ.1.37 లక్షల విలువ చేసే ఎరువులు, అలాగే ఫారం–సీ ఇంక్లూడ్ చేయనందున రూ. రూ.2.79 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు.

ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అమర్ డిమాండ్ చేశారు. కు శనివారం కర్నూలు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిపాలన అధికారి అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు రాకున్నా ఆర్.ఎస్.ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యం అడ్మిషన్లు నిర్వహిస్తుందన్నారు. ఈ విషయంపై ఆదోని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, ఆర్యన్, పృథ్వీ పాల్గొన్నారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేస్తున్న బీడీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అక్షరశ్రీ కళాశాల యాజమాన్యం అక్రమ ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తోందని, వెంటనే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేష్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సోమశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అక్షరశ్రీ జూనియర్ కళాశాల యాజమాన్యం ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పుస్తకాల పేరుతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కళాశాల యాజమాన్యం అనుమతులు లేకపోయినా లక్షల వ్యాపారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ నాయకులు శివలోకేష్, మహేష్, బీడీఎస్ఎఫ్ నాయకులు సాయి, యెహోను, విజయ్, చంద్ర, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక షరాఫ్ బజార్, ట్యాంక్ బండ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించి ఆయా పనులు సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అన్నక్యాంటీన్‌లో భోజన పంపిణీని పరిశీలించారు.

బొలెరో, బైక్ ఢీ

- యాత్రికుడికి గాయాలు

ఆలూరు రూరల్: బొలెరో వాహనంబైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న హర్ష అనే యాత్రికుడికి గాయాలయ్యాయి. స్థానిక గుంతకల్లు చెక్‌పోస్టు సమీపంలోని బళ్లారి రోడ్డులో శనివారం జరిగిన ప్రమాదం వివరాలు.. కర్ణాటక రాష్ట్రం తుముకూరుకు చెందిన హర్ష విహార యాత్రలో భాగంగా ఆదోని నుంచి బళ్లారికి వెళ్తున్నాడు. బళ్లారి వైపు వెళ్తున్న బొలేరో వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో హర్ష నడుము భాగంలో తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని స్థానికులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు.

ఆదోని అభివృద్ధికి ప్రభుత్వ విధానాలే అడ్డు

- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అభివృద్ధికి అడ్డుకాదు
- కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకనే ఆగిన పనులు
- సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ లోకేశ్వరి, సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తున్న కౌన్సిలర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీకి చెందిన పాలకవర్గ సభ్యులు అడ్డు కారని, కేవలం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే అడ్డు అని ఆదోని మున్సిపాల్ పాలకవర్గ సభ్యులు, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్‌అహ్మద్, అశోక్ అన్నారు. శనివారం ఆదోని పురపాలక సంఘం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. పూటకో విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వంతోనే ఆదోనిలో అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు నెలలు గడిచినా బిల్లులు మంజూరుకావడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదని కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుని పనులు జరిగేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కొరత లేదని కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించి పనులు చేయించాలని కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, అశోక్, చలపతి, ఫయాజ్ ఉన్నతాధికారులను కోరారు. ఆదోని మున్సిపాలిటీలో రూ.4.35 కోట్ల బిల్లులు అప్‌లోడ్ అయినప్పటికీ చెల్లింపులో జాప్యం జరుగుతోందన్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురావడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వ వైఫల్యాలే కారణమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని, చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను సభ్యులు కోరారు. అనంతరం వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, హెల్త్ ఆఫీసర్ సతీష్‌కుమార్, డీఈలు, ఏఈలు, టీపీఓ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలి మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి



బోయ అచ్చమ్మ (ఫైల్)

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బోయ అచ్చమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఈమె ఎంపీటీసీ సభ్యురాలుగా ఉన్న సమయంలో తన పరిధిలోని ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. అచ్చమ్మ మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఉదయం గోనెగండ్ల లోని ఆమె స్వగృహానికి చేరుకొని భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, నాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ, కాజిగడ్డ, ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణలకు వినతి పత్రం అందించారు. కౌన్సిలర్ మాట్లాడుతూపై కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిజాముద్దీన్ కాలనీలో ఎనిమిది నెలలుగా మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమయ్యాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మైనార్టీ కాలనీ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు సతమతమవుతున్నారన్నారు. కాజిగడ్డ, ఎన్టీఆర్ నగర్, నిజాముద్దీన్ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధరణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు శనివారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



బుట్టా రేణుకను సత్కరిస్తున్న పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజరత్నం

ఎమ్మిగనూరుటౌన్: పార్టీ పదవుల్లో నియామకమైన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక సూచించారు. పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శిగా నియామకమైన రిటైర్డ్ ఎంఈఓ పి.రాజరత్నం, కార్యదర్శి కాశీవిశ్వనాథ్‌రెడ్డి శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమెతో పాటు సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠలను సత్కరించారు. ఈ సందర్భంగా పదవులిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు బుట్టా రేణుకకు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ముట్టడి



మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: గుక్కెడు మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని తాగునీరు అందించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారంటూ శనివారం పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన మహిళలు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలు బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ డీఈ నీరజకు అందజేశారు. సీపీఎం నాయకులు రాముడు, అబ్దుల్లా మాట్లాడుతూ కాలనీలో మూడు సంవత్సరాలుగా మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నీటి సమస్య వున్న కనీసం అధికారులు మంచినీటి ట్యాంకర్లను కూడా పంపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మంచినీటి సరఫరా చేసి ఆదుకోవాలని వారు కోరారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త



సుచరిత, మండల వ్యవసాయాధికారి పెద్దకడబూరు

పెద్దకడబూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సుచరిత సూచించారు. బిల్లులు తప్పక తీసుకొని డీలర్ సంతకం చేయించుకోవాలని డబ్బులు తక్కువకు దొరుకుతాయి అని ఆశపడి లూజు విత్తనాలు తీసుకుంటే నష్టపోతారని హెచ్చరించారు. మండలంలోని రైతులు నకిలీల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మండలంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు.

విత్తనాలు కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు పెందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి.
- కొనే సమయంలో వ్యాపారి నుంచి బిల్లును తప్పక తీసుకోవాలి.
- జిన్నింగ్ లేదా లూజు పత్తి విత్తనాలు, కంపెనీ పేరులేని ప్యాకెట్లును కొనరాదు.
- పగిలి పోయిన ప్యాకెట్లు ఉన్నా, గడువు ముగిసిన విత్తనాలను ఎట్టి పరిస్థితిలో కొనరాదు.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబరు, రైతు పేరు, గ్రామము పేరు, విక్రయదారుడి సంతకము, తేదీలు, విత్తన రకము పేరు, బ్యాచ్ నెంబరు, గడువు తేదీ, నికర తూకము, నికర ధరతో పాటు కంపెనీ పేరు తప్పని సరిగా నమోదు చేయాలి. పై వివరాలు అన్నీ ఉంటేనే రైతులు బిల్లులను తీసుకోవాలి.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సంచులపై కంపెనీ సీలు ఉన్నదో లేదో గమనించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చిన బిల్లును పంట కాలము పూర్తి అయ్యేవరకు రైతులు భద్రపరుచుకోవాలి.
- అప్పు పద్ధతుల్లో కొనుగోలు చేసినప్పటికీ బిల్లులను మాత్రము కచ్చితంగా అడిగి తీసుకోవాల్సి ఉంటుంది.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని పరిశీలించాలి.
- సంతృప్తిగా ఉన్న విత్తన రకాలనే ఉపయోగించాలి. తద్వారా మంచి ఫలితాలు వచ్చే వీలు ఉంటుంది.